ఉపాధి జాతర

- పల్లెల్లో జోరుగా ఈజీఎస్ పనులు
- ప్రతి రోజు వేలల్లో కూలీల హాజరు
- జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం
- ఉపాధి పనిలో అయిదవ స్థానంలో జగిత్యాల జిల్లా

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గడంతో ఉపాధి హామీ పథకం పనులకు కూలీల జాతర ప్రారంభమైంది. రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా ఈజీఎస్ కూలీలకు పనులు కల్పించడంలో అయిదవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో అగ్ర జిల్లాల జాబితాలో జగిత్యాలకు చోటు లభించింది. ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా ప్రతి రోజు 66 వేలకు పైగా కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఆయా కూలీలతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ఉపాధి లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం గత యేడాది క్రితం భత్యాన్ని సైతం మరింత పెంచింది. గత మాదిరిగా కాకుండా నూతన సాంకేతికత నిబంధనలు కఠినతరం చేయడంతో గ్రామాల్లో పనుల సంఖ్య తగ్గింది. అయినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించడంతో మండల, గ్రామ స్థాయి అధికారులు కూలీల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా ప్రతి గ్రామంలో లక్ష్యం మేరకు కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో సగటున రోజుకు 66 వేలకు పైగా...

జిల్లా వ్యాప్తంగా సుమారు 1,40,490 మంది యాక్టివ్ కూలీలున్నారు. ఇందులో ప్రతి రోజు సుమారు 66 వేలకు పైగా కూలీలు వివిధ పనులకు వెళ్తున్నారు. అయినప్పటికీ కూలీల సంఖ్య మరింత పెంచి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఉన్నతాధికారులు సిబ్బందికి ప్రత్యేక సమావేశాల ద్వారా దిశ నిర్దేశం చేస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో ఈజీఎస్ కూలీల సంఖ్య పెరుగుతోంది.

వెల్గటూరు అత్యధికం.. జగిత్యాల అత్యల్పంగా

జిల్లాలో ఈజీఎస్ కూలీలకు పని కల్పించడంలో వెల్గటూరు మండలంలో అత్యధిక స్థానంలో నిలవగా జగిత్యాల అత్యల్ప స్థానంలో ఉంది. వెల్గటూరులో సగటున ప్రతి రోజు 5,424 మందికి పని కల్పిస్తుండగా గొల్లపల్లి 5,423తో ద్వితీయ స్థానంలో ఉంది. జగిత్యాల కేవలం 501 మందికి పని కల్పిస్తూ అత్యల్పంగా ఉంది. కాగా జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలంలో 3,362 మంది కూలీలకు, మల్యాలలో 3,999 మంది, సారంగపూర్ 3,274 మంది, కొడిమ్యాల 5,230 మంది, కోరుట్ల 2,636 మంది, బుగ్గారం 2,284 మంది, మేడిపల్లి 5,201 మంది, బీర్‌పూర్ 2,693 మంది కూలీలు ఈజీఎస్ పనులు నిర్వహిస్తున్నారు. మెట్‌పల్లి 3,568 మంది, జగిత్యాల రూరల్ 3,952 మంది, మల్లాపూర్ 4,348 మంది, రాయికల్ 4,205 మంది, పెగడపల్లి 4,623 మంది, కథలాపూర్ 3,373 మంది, ధర్మపురి 2,501 మంది ఈజీఎస కూలీలు పనులు పొందుతున్నారు.



రాష్ట్రంలో అయిదవ స్థానంలో జిల్లా..

ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ మొత్తంలో కూలీలకు పనులు కల్పించడంలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే అగ్ర జాబితాలో చోటు సంపా దించింది. రాష్ట్రంలో అయిదవ స్థానంలో జగిత్యాల జిల్లా నిలిచింది. ప్రతి రోజు 73,068 మందికి పని కల్పించి నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో, ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా తృతీయ స్థానంలో, వికారాబాద్ జిల్లా చతుర్థ స్థానంలో నిలిచాయి. ప్రతి రోజు 68,957 మందికి ఈజీఎస్ కింద పని కల్పిస్తూ జగిత్యాల జిల్లా అయిదవ స్థానంలో ఉంది. జిల్లాలో సగటున 175 గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజు 68 వేలకు పైగా కూలీలకు వివిధ పనులను ఈజీఎస్ కింద కల్పిస్తున్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం...

జిల్లా వ్యాప్తంగా నీటి సంరక్షణ పనులకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా సమతుల కందకాలు, నీటి నిలువ గుంతలతో పాటు పలు పనులు చేపడుతున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలు, ఫాంపాండ్ నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి సారించారు. అన్ని గ్రామాల్లో పంట కాలువలు, ఫీడర్ చానల్స్, పూడిక తీత పనులు, ఎంబ ట్యాంక్ పనులు ఎక్కువ మొత్తంలో చేపడుతున్నారు. రైతులకు ఉపయోగపడే పనులను నిర్వహించడంపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కూలీలకు ఉపాధితో పాటు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తుండడంతో ముున్ముందు నీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాబావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాబోయే నెల రోజులు నిరంతరం పని కల్పించేలా...

జిల్లాలో రాబోయే నెల రోజుల వరకు ప్రతీ గ్రామంలో నిరంతరంగా పని కల్పించుటకు కావాల్సిన పనులను గుర్తించి సిద్ధంగా ఉంచారు. జిల్లాలో ఆసక్తి ఉన్న కూలీలం దరిని గుర్తించి ఈజీఎస్ పనులకు తీసుకు వచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. మండలాల వారిగా తక్కువ లేబర్ రిపోర్ట్ అవుతున్న పరిస్థితులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒక పని పూర్తికాగానే మరొక పనిని గుర్తించి కూలీలు పనికి వచ్చేటట్లు హాజరు శాతం తగ్గకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఎక్కువ కూలీలు హాజరు అవుతున్న గ్రామాలలో ఒక పని పూర్తి కాగానే మరొక పనిని గుర్తిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుత సంవత్సరం ఎక్కువ కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాలని ఆదేశాల మేరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామాల వారీగా అవసర మైన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారు.

ఆసక్తి కలిగి యున్న వారందరికి పని కల్పిస్తాం

సంపత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో ఆసక్తి కలిగి యున్న వారందరికి ఉపాధి హామీ పథకం కింద పని కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. వారందరిని పనుల్లోకి తీసుకవచ్చి గ్రామాల్లో మరింత ముమ్మరం చేస్తున్నాము. ఈ జీఎస్ పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో అగ్రజాబితాలో చోటు సాధించింది. అన్ని వర్గాల సహకారాలతో ఈజీఎస్ పనులను లక్ష్యం మేరకు చేసేలా ముందుకు వెళ్తున్నాము. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు చేస్తున్న దిశా నిర్దేశాలను పాటిస్తూ వంద శాతం లక్ష్యం సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నాము.

వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ తిరుమలరావు



సీఈ తిరుమల రావును సన్మానిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ, ఇతరులు

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు అధికారులు సత్వరమే పరిష్కరించాలని వరంగల్ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ తిరుమలరావు అన్నారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో పాడైన పరికరాలు వెంటనే మార్పు చేయాలన్నారు. 33 కేవీ, 11 కేవీ లైన్ల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కరెంటు ట్రిప్పింగ్‌ల సమయాన్ని వీలయినంతగా తగ్గించాలన్నారు. అధిక లోడ్ ఉన్న చోట సర్వే చేసి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలను సాధ్యమైనంత తొందరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు నిరంతరాయముగా నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన చీఫ్ ఇంజనీర్ తిరుమల రావును జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, ఎస్ఏవో తిరుపతయ్య, టెక్నికల్ డీఈ గంగారాం, డీఈ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

డీఎంహెచ్‌వో శ్రీధర్



మల్యాలలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

మల్యాల, మే 20: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పి.శ్రీధర్ అన్నారు. మల్యాల ప్రాథమిక ఆసుపత్రిని సోమవారం సందర్శించిన అనంతరం వైద్యులు, సిబ్బందితో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వైద్య సేవలపై పలు సూచనలు చేశారు. ఎఎన్‌సీ కేసులను నిత్యం పరిశీలించాలని, క్షయ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు రెగ్యులర్‌గా పరీక్షలు చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రిజిష్టర్లు పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి డా.శ్రీనివాస్, వైద్యు రాలు మౌనిఖ, డీపీఎంవో దేవ్‌సింగ్ వైద్య సిబ్బంది రమేష్, నాగలక్ష్మి, సునంద, రోహిదాస్, రమణమ్మ ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల టౌన్, మే 20: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 32వ వార్డు భీష్మనగర్ చెందిన మత్స్యకారుడు, బీఆర్ఎస్ కార్యకర్త కొండ్ర విద్యాసాగర్ గత వర్షాకాలంలో చేపల వేటకు వెళ్లి వరదలో చిక్కుకుని మృతి చెందాడు. పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా రూ. 2 లక్షల చెక్కు మంజూరు కాగా మృతుడి భార్య జమునకు సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేసి మాట్లాడారు. నియోజక వర్గంలో 50 వేల మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరె గంగమల్లు, సంఘం అధ్యక్షుడు శంకర్, నాయకులు శంకర్, శేఖర్, నర్సయ్య, లింగారెడ్డి, మహేష్, రాజేష్, రాజ శేఖర్ ఉన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 24వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 2వేల మంది విద్యార్థులకు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమయానికంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ఓఎంఆర్ విధానంలో జరిగే పరీక్షకు బ్లాక్ లేదా బ్లూ పెన్ మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తులను అనుమతించమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించబడుతున్న పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి నీలిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి, 5వ తరగతి, 8వ తరగతిల నందు ప్రవేశాలకు దరఖాస్తులను కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ లోపు కరీంనగర్‌లోని గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. వివరాలకు 9652118867లో సంప్రదించాలని తెలిపారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

పెగడపల్లి, మే 20 : ప్రభుత్వ నిబందనలకు లోబడే నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని , కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని మండల వ్యవసాయాదికారి వినీల పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలోని ఫర్టిలైజర్ దుకాణాలను, పెగడపల్లి, నంచర్ల, నందగిరి ప్రాథమిక వ్యవసాయ సంఘాలను సోమవారం వ్యవసాయాదికారి వినీల తనిఖీ చేశారు. ప్రతి దుకాణాదారు తమ దుకాణ లైసెన్సు, స్టాక్ బోర్డు ప్రదర్శించాలని, ప్రతి కొనుగోలు దారుడికి బిల్లు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సైతం బిల్లు కాగితంతో పాటు విత్తన సంచికి గల లేబుల్ భద్రపరుచుకోవాలన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 19 పరీక్షా కేంద్రాలలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్, అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

పకడ్బందీగా కొండగట్టు హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించనున్న కొండగట్టు హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షేత్ర సంప్రదాయ సారముగా హోమం, పూజ, అర్చనాది సేవలతో పాటు దార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునన్నారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం యాగశాల శుద్ధి, పుణ్యాహవచనం, అఖండ దీపాస్థాపనతో కార్యక్రమాలను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత రోజుల్లో జరిగే పలు పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, కలెక్టరేట్ ఏవో హన్మంత్‌రావు, కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్, డిప్యూటీ ఈవో అంజయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం : ఎంపీడీవో



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్, మే 20 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. జగిత్యాల రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో అమ్మ ఆదర్శపాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో జూన్ 12లోపు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల న్నారు. దోమల నివారణకోసం ఫాగింగ్ మిషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ రాంమోహన్, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య, ఎంవోవో గాయత్రి, పశు వైద్యాధికారి నరేష్, ఏపీఎం గంగాధర్ సూపరిండెంట్ చౌడారపు గంగాధర్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపెడితే సహించం

ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, మే 20 : కొనుగోలు సెంటర్లలో రైతులను ఇబ్బందులకుగురిచేస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి హెచ్చరించారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామపంచాయితీపరిధిలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గల ఐకేపీ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. కొనుగోళ్లలో జాప్యంపై రైతులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 23 లోగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి స్థాయిలో ముగించాలని అధికారులను ఆదేశించారు. వాతావరణం మార్పుల దృష్ట్యా రైతులకు నష్టం జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంటర్‌లో రైతులకు కావాల్సిన మౌలికసదుపాయాలను కల్పించాలన్నారు. ఉన్నతాధికారులు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి కొనుగోళ్ల వేగవంతంగా పూర్తిచేసేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తిప్ప న్నపేట, గోపాల్‌రావుపేట రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు

గొల్లపల్లి, మే 20 : వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న దృష్ట్యా రైతులకు ఏలాంటి ఆటంకాలు కల్గకుండా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని, తేమ శాతం పరిశీలించి వెంటనే బార్ధానా రైతులకు అందించాలని, బస్తాల్లో నింపిన ధాన్యంను తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలన్నారు. లారీల కొరత, కేటాయించిన మిల్లుల లక్ష్యం చేరుకుందని, దీంతో మిల్లర్లు ధాన్యం బస్తాలను ఆన్‌లోడింగ్ చేసుకోవడానికి నిరాకరిస్తున్నారని అధికారులు, నిర్వాహకులు ఆడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన అయన పెద్దపల్లి జిల్లాలోని పలు మిల్లర్లతో మాట్లాడి పలు మిల్లులను కేటాయించారు. అలాగే కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించాలని, వానాకాలం ముంచుకొస్తున్న దృష్ట్యా త్వరితగతిన కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, రవాణాకు సిద్దంగా ఉంచిన ధాన్యం బస్తాల గూర్చి, ఇంకా రైతుల నుంచి సేకరించాల్సిన ధాన్యం నిల్వల గూర్చి అధికారులను అడిగితెలుసుకున్నారు. రైతుల సాధకబాధకాల గూర్చి ఆరా తీశారు. ఏలాంటి షరతులు లేకుండా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని, రైతులకు ఇబ్బందులు కల్గిస్తే ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, మార్కెట్ కార్యదర్శి ఫైజోద్దీన్, సింగిల్‌విండో సీఈవో రాంసుధాకర్ రావు, సూపర్‌వైజర్ వెంకటనర్సయ్య, డీవో సురేందర్, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆడిషనల్ కలెక్టర్ రాంబాబు

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం

జగిత్యాల టౌన్, మే 20 : జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం కొనసాగాయి. వేడుకల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు నంబి వేణుగోపాల చార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కర్యాక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి రెండు గేదెలు మృతి

సుల్తానాబాద్, మే 20: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం రెండు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒజ్జ సదయ్య అనే రైతుతో పాటు దూడం రాములు అనే రైతుకు చెందిన పాడి గేదెలు మేతకు వెళుతుండగా మార్గమధ్యలో తెగిపడిన విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని రైతులు తెలిపారు. తమకు తగిన నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వెలవెలబోతున్న గోదావరి

● మరమ్మతుల కోసం సుందిళ్ల బ్యారేజీ ఖాళీ

కోల్‌సిటీ, మే 20: గలగల పారే గోదావరి వెలవెలబోతోంది.ఏడేళ్లుగా నిండుకుండలా ఉన్న గోదావరిలో ఇప్పుడు మడుగులు దర్శనమిస్తున్నాయి. రెండేళ్ల భారీ వరదలకు ఉన్న ఇసుక కొట్టుకపోయి రాళ్లు తేలాయి... అక్కడక్కడ లోతైన గుంతల్లో మాత్రమే నీరు మిగిలింది. మరమ్మతుల కోసం ఈ నెల 18న సుందిళ్ల బ్యారేజీలో నుంచి 0.7 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. ప్రీ మాన్‌సూన్ ఆపరేషన్స్, మెయింటనెన్స్ పనులు నిర్వహించనున్నారు. ఇందు కోసం బ్యారేజీలోని నీటిని దిగువకు వదిలారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన గోదావరిలో ప్రవాహం లేదు. ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీరే ప్రస్తుతం గోదావరిలో కలుస్తుంది. గోదావరిలో ఏర్పడిన మడుగుల్లోని నీటిలోనే భక్తులు పుణ్య స్నానాలు చేస్తున్నారు. గోదావరిఖని పుష్కర ఘాట్ నుంచి ఇసుకలో నడిచి వెళ్లి పుణ్యస్నానాలు చేయడం పరిస్థితి ఏర్పడింది.

● సింగరేణికి గోదావరే దిక్కు..

గోదావరిలో నీరు తగ్గిపోవడంతో దీని ప్రభావం సింగరేణి మంచినీటి సరఫరాపై పడనున్నది. గోదావరినదిలోని ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ ద్వారా సింగరేణి కాలనీల అవసరాలకు ప్రతి రోజూ 23 నుంచి 25 ఎంఎల్‌డీల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సాండ్ బెడ్‌లో ఉన్న నీటినే సింగరేణి వాడుకోవాల్సి వస్తోంది. మరో పది రోజుల్లో వర్షాలు కురవక పోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.


గోదావరిలో తగ్గిన నీరు

తప్పుడు డాక్యుమెంట్స్‌తో భూమి అమ్మకం : ఇద్దరి అరెస్టు

చొప్పదండి, మే 20: చొప్పదండి పట్టణంలోని సర్వే నంబరు 301లో తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని అమ్మిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ ఉపేంద్రాచారి తెలిపారు. 301 సర్వే నంబర్‌లో గుర్రం రాంరెడ్డి అనే వ్యక్తికి 65 గుంటల భూమి ఉంది. ఈ భూమిని రాంరెడ్డి 2010లో ముసిపట్ల దేవేందర్‌రెడ్డి, అన్నాడి శ్రీకాంత్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశాడు. తన వాటాగా వచ్చిన 32 గుంటల భూమిని ముసిపట్ల దేవేందర్‌రెడ్డి చొప్పదండికి చెందిన కొత్తూరు అంజనేయులు, సుద్దాల వెంకటస్వామికి 2019 సంవత్సరంలో విక్రయ ఒప్పందం, జీపీఏ చేశాడు. అదే భూమిలోని ఆరు గుంట భూమిని సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు అంజనేయులు ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన చిలుక బాలామణి, కళ్లెం అంజిరెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం అదే భూమిని పాత జీపీఏ డాక్యుమెంట్లు చూపించి కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్ రెడ్డి వద్ద ఎనిమిది లక్షల రూపాయలు తీసుకుని అమ్మారు. రిజిస్ట్రేషన్ చేసి మోకా ఇప్పిస్తామని చాలా రోజుల నుంచి తప్పించుకుంటున్నారు. భూమి చూపెట్టమని అడిగితే అంతు చూస్తామని బెదిరించారు. దీంతో వైద్యుల మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం సోమవారం సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు అంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నరైతులు

రామడుగు, మే 20: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఊర చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఊర చెరువులో రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించడంతో సమీప బావులలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే నిర్మాణ పనులకు చెరువులోని మట్టిని తీయడానికి అనుమతులు తీసుకున్నట్లు సదరు కాంట్రాక్టర్ బెదిరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా మట్టి తరలిస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ మట్టి తరలింపును నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

బీపీఎంపై కేసు నమోదు

గొల్లపల్లి, మే 20: మండలంలోని చిల్వాకోడూర్ తపాల శాఖలో ఖాతాదారులకు సంబంధించిన 11.60 లక్షల రూపాయలు స్వాహా చేసిన బీపీఎం దూడ నల్ల పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సోమవారం తెలిపారు. చిల్వాకోడూర్ బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న నల్ల పోచయ్య తపాల శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఖాతాదారులు తమ డబ్బులను పొదుపు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు తపాల శాఖలో పొదుపు చేసుకుంటున్నారు. బీపీఎం ఖాతాదారుల నుంచి తీసుకున్న సొమ్మును వారి వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు ఇటీవల వెలుగు చూసింది. బాధితులు గొల్లపల్లిలోని తపాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయగా, విచారించిన అధికారులు ఖాతాదారుల డబ్బును స్వాహా చేసినట్లు తేలింది జగిత్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టఆఫీస్ జి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీపీఎం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం : ఒకరి అరెస్టు

ఇల్లంతకుంట, మే 20: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకులను మోసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన కారునాథం శివకృష్ణను సోమవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య ఇదే గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్ల రాము, తిప్పరవేని చంద్రశేఖర్, దారం శ్రీనివాస్‌రెడ్డికి శివకృష్ణను పరిచయం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి ఉద్యోగాలు ఇప్పిస్తానని శివకృష్ణ వారివద్ద నుంచి 6.50 లక్షల రూపాయలు వసూలు చేశాడు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సోమవారం ఇల్లంతకుంట బస్టాండులో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటే యువకులు నమ్మిమోసపోవద్దని ఆయన అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన నందెవేణి రేణుక (23) కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి ఆదివారం రాత్రి తిరిగి ఆటోలో బయలుదేరింది. కొలనూరు గ్రామంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రేణుక సోదరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ఇసుక లారీ

రామగిరి, మే 20: మండలంలోని నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో అదుపు తప్పిన ఇసుక లారీ కారును ఢీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో సోమవారం ఓ లారీ వేగంగా వస్తూ అదుపు తప్పింది. బ్యాంక్ ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు అన్నారు.

జేఎన్టీయూ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్

ఉత్తర్వులు జారీచేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకువచ్చారు.

మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

గంభీరావుపేటలో సైబర్ మోసం

● రైతుల బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3 లక్షల 24 వేలు స్వాహా ● వాట్సాప్‌లో ఫేక్ లింక్ మెసేజ్‌లు

గంభీరావుపేట, మే 20: గంభీరావుపేట మండలంలో పలువురు సైబర్ మోసానికి బలయ్యారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌ల్లో ఫేక్ లింక్‌ల మెసేజ్‌లు పంపుతూ బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు స్వాహా చేస్తున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో రూ. 3 లక్షల 24 వేల 900 వేలు సైబర్ నేరగాళ్లు కొట్టేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. మోసపోయిన నలుగురు బాధితులు రైతులే కావడం గమనార్హం. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి నుంచి రూ. 45 వేలు, దండు నరేష్ ఖాతా నుండి రూ. 44 వేల 900, లంగారెడ్డిగారి రాజశేఖర్‌రెడ్డి ఖాతా నుండి 50 వేలు, కోటయ్యగారి లత ఖాతా నుంచి రూ 1 లక్షా 85 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. రైతులు వరి ధాన్యం అమ్మిన డబ్బులు ఇటీవల యూనియన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. డబ్బులు జమ అయిన కొద్ది రోజుల్లోనే వీరి ఖాతాల నుంచి డబ్బులు పోయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నలుగురు బాధితులు బ్యాంక్ వద్దకు పరుగులు తీశారు. ఫేక్ లింక్‌ల మెసేజ్‌ను ఓపెన్ చేయడం వల్లే బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు లూటీ అయినట్టు బ్యాంక్ అధికారులు బాధితులకు చెప్పారు. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితులు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే పేరిట పంపిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడం వల్లే డబ్బులు స్వాహా అయ్యాయని పోలీస్‌లు గుర్తించారు. ఆ ఫేక్ లింక్ క్లిక్ చేసిన వెంటనే సెల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి, ఓటీపీ ద్వారా డబ్బులను కొట్టేస్తున్నట్టు పోలీస్‌లు నిర్ధారించారు. ఆరుగాలం శ్రమించిన వరి ధాన్యం డబ్బులు సైబర్ నేరగాళ్ల పరం కావడంతో రైతు కుటుంబాలను తీవ్రంగా బాధించింది. పోయిన మా డబ్బులు తిరిగి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఫేక్ లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, పోలీస్‌లు ప్రజలకు సూచించారు.


డబ్బులు పోయాయని ఆవేదనతో ఉన్న రైతులు

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

● రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

సిరిసిల్ల క్రైం మే 20: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జోగినిపల్లి భాస్కర్‌రావు సోమవారం ఏసీబీకి చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశం అదే గ్రామంలో ఖబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. రూ.4.35 లక్షలతో నిర్మించిన ఖబ్రస్థాన్ ప్రహరీ బిల్లు ఫైల్‌ను చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు సీనియర్ అసిస్టెంట్ జోగినిపల్లి భాస్కర్‌రావును కలిశాడు. నాలుగు నెలలుగా తిప్పుకుంటున్న భాస్కర్‌రావు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ వెంకటేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నాలుగు రోజులుగా వలపన్నిన ఏసీబీ అధికారులు సోమవారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో వెంకటేశం నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటుండగా భాస్కర్‌రావును పట్టుకున్నారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టర్ వెంకటేశం వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ బిల్లుకు సంబంధించిన ఫైల్స్‌తోపాటు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్‌ను కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఏ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ : 9154388954 సమాచారం అందించాలని, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు కృష్ణకుమార్, తిరుపతి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


బాధితుడు జి. వెంకటేశ్


ఏసీబీకి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు

గూడెం వద్ద గోదావరిలో మునిగి యువకుడి మృతి

దండేపల్లి,మే 20: హనుమాన్ మాలధారణ స్వీకరించేందుకు వచ్చిన యువకుడు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషీ (19) అతని స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్మ సాయితో కలిసి హనుమాన్ దీక్ష స్వీకరించేందుకు గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలోని అనుబంధ హనుమాన్ ఆలయానికి వచ్చారు. దీక్షకు ముందు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో దిగారు. కీర్తన్‌గౌడ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో జాలర్లు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కీర్తన్‌గౌడ్ మృతి చెందాడు. మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్‌గౌడ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి దుర్గం తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.


కీర్తన్‌గౌడ్(ఫైల్)

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

శంకరపట్నం, మే 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో టిప్పర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసులు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పర్వతం ఎల్లయ్య (51) శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన తన కూతురు ఊర పద్మ ఇంట్లో రెండు నెలలుగా ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకుంటున్నాడు. సోమవారం వ్యక్తిగత పనిపై బయటికి వెళ్లాడు. తాడికల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు రాగానే జాతీయ రహదారి 563 నిర్మాణ సంస్థ బుల్డ్‌కాన్‌కు చెందిన ఓ టిప్పర్ హుజూరాబాద్ వైపు వెళ్తూ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్ ఎల్లయ్యపై నుంచి వెళ్లగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీల్‌రాం పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన 5నిమిషాలకే ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కొడుకు పర్వతం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు రాస్తారోకో చేయగా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేష్‌తో పాటు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, అదనపు సిబ్బంది సంఘటన స్థలానికి చేసుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు.

టిప్పర్లే మృత్యు శకటాలు

● తాడికల్‌లో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతి

శంకరపట్నం : శంకరపట్నం మండలంలో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. కరీంనగర్-వరంగల్ రహదారిపై ఐదు రోజుల వ్యవధిలోనే తాడికల్‌లో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గత బుధవారం ఆయిల్ ట్యాంకర్ ప్రజలపై దూసుకు వచ్చిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో పలు యాక్సిడెంట్లకు కారణమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని రావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్ల అధిక వేగం, భారీ వాహనాలు, ఓవర్‌లోడ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన చర్యలు చేపట్టి ఇక మీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్ టౌన్, మే 20:ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. వర్షం వల్ల మొలకెత్తిన, తడిసిన ధాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేలా చూడాలన్నారు. ఈ మేరకు రైస్‌మిల్లర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సిరిసిల్ల అదనపు కలెక్టర్లు లక్ష్మికిరణ్, శ్యాంప్రసాద్‌లాల్, రాంబాబు, బీమానాయక్, పౌర సపరఫరాల జిల్లా మేనేజర్ రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఆర్‌డీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, మే 20: అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర సంచాలకులు ఆర్ వి కర్ణన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం జిల్లా ప్రత్యేకాధికారి కర్ణన్ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణన్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడారు. వారి నుంచి కొనుగోళ్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతుల వద్ద నుంచి మద్దతు ధర్‌పై కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులున అదేశించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


గర్రెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కర్ణన్

నక్కను రక్షించిన ఫారెస్టు అధికారులు

శంకరపట్నం, మే 20: వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన నక్కను ఫారెస్టు అధికారులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. సోమవారం మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులో ముప్పిడి విజేందర్‌రెడ్డి వ్యవసాయ బావిలో నక్క పడిందని సమాచారం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీటీ ఆఫీసర్ తక్షణమే అక్కడికి చేరుకొని బావి నుంచి నక్కను బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు.


బావినుంచి బయటకు తీసిన నక్క

జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ

ధర్మపురి, మే 20: బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌లో దీటి శ్రీనివాస్, దీటి మహేష్‌లను హత్యచేసిన కేసులో ఏడుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సోమవారం ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్ట్ చేసి చూపించి హత్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపులాపూర్ గ్రామంలో దీటి తార, ఆమె కొడుకు దీటి శ్రీనివాస్ 2018లో నాగుల అంజయ్య వద్ద ఇంటిని కొన్నారు. అదే ఇంటిని 2017లో అంజయ్య తమకు విక్రయించాడని తార ఇంటి పక్కనే ఉన్న బుర్ర లక్ష్మి ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ కోర్టును ఆశ్రయించారు. 2023లో కోర్టు సివిల్ కేసును కొట్టివేసింది. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నెల 16న రాత్రి తార, కొడుకు శ్రీనివాస్, దీటి మహేష్, నవీన్ కుటుంబ సభ్యులకు గొడవ జరిగింది. దీంతో శ్రీనివాస్‌ను అతడికి సహకరిస్తున్న మహేష్‌ను ఎలాగైనా చంపాలని నవీన్ అనుకున్నాడు. అదే రోజు రాత్రి నవీన్ స్నేహితులు పవన్, రాజేందర్, వెంకటేష్, గంగారాజం అలియాస్ మనోజ్, శేషు, అజయ్‌లతో కలిసి శ్రీనివాస్, మహేష్‌లపై ఇనుప పైపులు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుగ్గారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సంఘటనకు కారణమైన బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజలపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సతీష్, ఉమాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కొండస్వామి ఆలయంలో కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 20: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండ స్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో వేదపండితుడు చక్రపాణి మాధవచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గ్రామ పంచాయతీ నుంచి పుస్తె, మట్టెలను ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ స్థులు డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

ధర్మపురిలో వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 20: నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాస పూర్వక, శోడశోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నకూటోత్సవంలో భాగంగా ఉదయం పలు రకాల ప్రసాదాలతో మహా నివేదన, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహిం చారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తులసీ దండలతో స్వామివారల అలంకరణ

రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీల పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కోల్‌సిటీ, మే 20: గోదావరిఖని గంగానగర్‌లోని మిలీనియం క్వార్టర్స్ సమీపంలో ఆదివారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. టీఎస్03యూడీ0220 నంబర్ గల వాహనంలో 65బస్తాలు, టీఎస్22టీ8686 నంబర్ గల వాహనంలో 50బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి బేగంపేటకు చెందిన పోలుదాసరి సంతోష్, తూర్పాటి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

యారన్ సబ్సిడీ సమస్య పరిష్కరించాలి


సిరిసిల్ల చేనేత జౌళిశాఖ ఎదుట ధర్నా చేస్తున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 20: బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే పదిశాతం యారన్ సబ్సిడీ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల నేతన్నల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను తగ్గించకుండా వెంటనే అందించాలన్నారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన దాదాపు 10 నెలల పెండింగ్ డబ్బులను చెల్లించాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 24వ తేదీన సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క దేవదాస్, గుండురమేష్, కంది మల్లేశం, బెజుగం సురేష్, మూషం శంకర్, స్వర్గం శేఖర్, రవీందర్, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్, రాజమౌళి, శ్రీధర్, నరేష్, దామోదర్, భాస్కర్, తిరుపతి, అశోక్, శేఖర్, విజయ్, సంపత్, శంకర్, రవి, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్ సతీష్, లక్ష్మణ్, మల్లేశం, మనోహర్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీం ఏర్పాటు : వీసీ

గణేశ్‌నగర్,మే 20: శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీంను మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ తెలిపారు. యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సూరపల్లి సుజాత- 9849468281,టెక్నికల్ అసిస్టెన్స్‌గా మార్క సంతోష్‌కుమార్-9030402257, గొల్లె మారుతి-9866625885, సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రవీణ్‌లను నియమించారు. యూనివర్సిటీకి సంబంధించి దోస్త్ సేవలకు టీం పనిచేస్తుందని వీసీ తెలిపారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 125క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించారు.

ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు

● కాలిబూడిదైన రెండు లక్షల నగదు, ఆభరణాలు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటల్లో రెండు లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ఊర కొండయ్య కుటుంబం ఒకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం నిత్యావసర సరుకులను తీసుకురావడం కోసం ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లారు. ఇంట్లో మంటల చెలరేగి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే తాళం పగులకొట్టి లీకేజీ అయి ఉన్న గ్యాస్ సిలెండర్‌ను బయటకు విసిరేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. అప్పటికే ఇంట్లో ఉన్న మంచాలు బీరువా ఇతర సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉన్న రెండు లక్షల నగదుతో పాటు వెండి బంగారు నగలు కూడా మంటల్లో కాలిపోయాయి. సంఘటన స్థలానికి కరీంనగర్ నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి యాభై కిలోల బియ్యం తదితర నిత్యావసర సరుకులను బట్టలను అందించారు. కాగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజయ్య తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.


కాలిపోయిన నోట్లను పరిశీలిస్తున్న భాదితుడు

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తహసీల్దారుకు బీజేపీ నాయకుల వినతి

కొడిమ్యాల, మే 20 : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల బీజేపీ నాయకులతో కలిసి వరి ధాన్యానికి తాలు, తప్ప, తరుగు తేమ పేరుతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధరను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులను కొనుగోలు సమయంలో ఇబ్బందులపాలు చేయవద్దన్నారు. ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ 500 రూపాయలు అనటంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కలిపించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడిచినా ఎన్నికల మెనీఫెస్టోలో పెర్కొన్న విధంగా రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా, రుణమాఫీ అందించడంలో విఫలమైందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు నర్సింహరెడ్డి, రాజే శం, బుచ్చిరాములు, రాకేష్, తిరుపతిరెడ్డి, అరుణ్, తిరుపతి, వెంకట్‌రావు, రాజు ఉన్నారు.

చికిత్స కోసం ప్రభుత్వ విప్ ఆర్థికసాయం

ధర్మపురి, మే 20: ధర్మపురి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన పులి సృజన్ కాలుకి గాయమై జగిత్యాల ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరుగగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తరఫున రూ 10,000 ఆర్థికసాయం సోమవారం ప్రకటించారు. మండల కాంగ్రెస్ నాయకుడు బొల్లారపు పోచయ్య సృజన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆయన నగదు అందించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్న లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మపురి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో నిర్వహించే గంగమ్మ బోనాల వేడుకలకు హాజరు కావాలని, ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామంలో నిర్వహించే లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని గ్రామస్తులు ఆహ్వానించారు. బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పంచిత హరిక్ష ఇటీవల జరిగిన నేషనల్ సాఫ్ట్ బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించగా ఆయనను ప్రభుత్వ విప్ శాలువా కప్పి సన్మానించారు. .

ఆలయంలో కుంకుమ పూజలు



ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మల్యాల, మే 20: మల్యాల మండల కేంద్రంలోని శ్రీ మఠమాం జనేయ స్వామి సంస్థాన పంచవింశతి(25వ) వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా రోటిగూడ శ్రీహరి మౌనస్వామి ఆధ్వర్యంలో మొదటి రోజు సోమవారం హనుమాన్ దీక్షాపరులచే నగర సంకీర్తన, ధర్మ ద్వజారోహణ, తులసీమాత పూజ తదితరవి నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. గత నెల 30 నుంచి నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామ ఏకనామం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహాకులు, ఆధ్యాత్మికవేత్త మిట్టపల్లి లక్ష్మీనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంగా ఏర్పడిన విద్యార్థులు

కోరుట్ల, మే 20 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003-2006 సంవత్సరం బీఏ చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డారు. పట్టణంలోని ఓ కళ్యాణ భవనంలో అపూర్వ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగ వ్యాపార వివరాలను సేకరించి మునుముంద వారు చేయవలసిన సామాజిక సేవలపై చర్చించా రు. డిగ్రీ కళాశాల ప్రస్తుతం ఉన్న సిబ్బంది, ఉపన్యాసకులతో పాటు వారికి విద్యా బోధనను అందించిన ఉపన్యాసకులను సన్మానించి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ వాసవి, ఉపన్యాసకుడు వెంకన్న, పీహెచ్‌డీ సాధించిన పూర్వ విద్యార్థి రాజేందర్ రెడ్డిలను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

జీఎంఆర్ ట్రస్ట్ పరిశీలన

రాయికల్, మే 20: రాయికల్ పట్టణంలోని జీఎంఆర్ ట్రస్ట్‌ను వనవాసి కళ్యాణ పరిషత్ అఖిల భారత ఇతరక్ష ప్రముఖ్ గిరీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న వృత్తి విద్య సర్టిఫికెట్ కోర్సుల్లో నైపుణ్యం పొందుతున్న ట్రస్ట్ విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం ట్రస్ట్ ద్వారా లబ్ధి పొందుతూ ఉపాధి పొందిన విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సుప్రీం కోర్టు అడ్వకేట్ శైన్ జీ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, కేంద్ర సింగ్ డాక్టర్ రాజారెడ్డి, కల్లెడ, ధర్మపురి ట్రస్ట్ ప్రిన్సిపాల్ మహేష్, టీచర్ నాగేందర్ ప్రమోద్ ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా హరిప్రసాద్

కథలాపూర్, మే 20 : మండల జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పులి హరిప్రసాద్‌ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండబేరి నరేష్ ప్రకటించారు. పులి హరిప్రసాద్‌కు నియామపత్రంను జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నల్ల వెంకటేశ్వర్ల్ సోమవారం అందించారు. తన నియమాకానికి సహ కారం అందించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులకు పులి హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ నాయ కులు బాలే అజయ్, జిల్లా మమత, బాలె మహేష్, ఎడ్ల శ్రీశైలం, కునరపే గణేష్, పెద్ది అనిల్, బార్గవ్ వెంకటరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

24న ఎంపీపీ ఎన్నిక

మల్యాల, మే 20: ఈ నెల 24న మల్యాల ఎంపీపీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి ఎంపీపీ మిట్టపెల్లి విమలపై గత నెలలో అవిశ్వాసం నెగ్గడంతో నూతన ఎంపీపీ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేయడంతో ఆర్డీవో సమక్షంలో ఎంపీపీ ఎన్నిక జరుగనుంది. దీనికి సంబంధించిన సమావేశం నోటీసులను ఎంపీటీసీలకు ఇప్పటికే మండల పరిషత్ అధికారులు అందజేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జీ ఎంపీపీగా వైస్ ఎంపీపీ పోతాని రవి గత నెల 8నుంచి కొనసాగుతున్నారు.

అవార్డుకు ఎంపిక

మల్యాల, మే 20: మండలంలోని రాజారం తాజా మాజీ సర్పంచ్ ఎడిపెల్లి సుగుణఅశోక్ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయిలో అందించే అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ మేరకు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ ఓ ప్రకటన విడుదల చేస్తూ సమాజ సేవకు కృషి చేసే వారికి ఈ పురస్కరం అందించనున్నట్లు పేర్కొన్నారు. అవార్డు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు

రేపు ఎల్లమ్మ కల్యాణోత్సవం

వేములవాడ టౌన్, మే 20: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో బుధవారం వరకు రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించ నున్నట్లు గౌడ కులస్థులు తెలిపారు. సిద్దోగంలో భాగంగా సోమవారం గౌడ కులస్థులు జోగు కార్యక్రమాన్ని నిర్వహించారు.



చెగ్యాంలో హాండ్ బాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

జోరుగా.. హుషారుగా

- ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం
- 50 మందికి పైగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులు
- హాండ్ బాల్ క్రీడలకు పెద్దపీట

వెల్గటూర్, మే 20: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం జోరుగా హుషారుగా సాగుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన చెగ్యాంలో యువకుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఈటీ జెట్టిపల్లి అశోక్ పర్యవేక్షణలో శిక్షణ శిబిరం ఈ నెల 1 నుంచి ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించిన నాటి నుంచి క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 31 వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగను న్నది. గ్రామంలోని యువకులకు క్రీడల పట్ల అవగాహన కల్పించేలా పీఈటీ కృషి చేస్తున్నారు. వేసవిలో విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాల నుంచి , మొబైల్ ఫోన్లు దూరం చేసేలా ఈ శిక్షణ శిబిరం దో హదపడనున్నది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తుం డడంతో 50 మందికి పైగా బాల బాలికలు, యువతీ యువకులు హాండ్ బాల్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. హ్యాండ్ బాల్‌లో ఓనమాలు దిద్దుకున్న కొందరు బాల బాలికలు రాష్ట్ర, జా తీ య స్థాయి పోటీల్లో పాల్గొని ఔరా అనిపించారు. రాష్ట్ర, జాతీయ స్థా యి పోటీల్లో పాల్గొని రాణించిన క్రీడాకారులను ఆద ర్శంగా తీసుకొని మరి కొందరు ముందుకు వచ్చి హాండ్ బాల్ క్రీడలో శిక్షణ పొందు తున్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, దేహధారుడ్యాన్ని పెంపొందిస్తాయని తెలిసిన యువత క్రీడల పట్ల మక్కువ చూపుతున్నారు.

● హ్యాండ్ బాల్ క్రీడలకు పెద్ద పీట

చెగ్యాం ఉన్నత పాఠశాల నుంచి హ్యాండ్ బాల్ క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. అక్షయ, అశ్విత్‌లు అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ పథకాలు సాధించి, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 17 విభాగంలో రాంచరణ్, రిషిత, వైష్ణవిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు.



చెగ్యాంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

చెగ్యాం పాఠశాల నుంచి మొత్తం 15 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనగా ఒక గోల్డ్ మెడల్, 3 సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించడం విశేషం.

● సద్వినియోగం చేసుకోవాలి

- పీఈటీ జెట్టిపల్లి అశోక్



బాల బాలికలు, యువతీ యువకులు హాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రీడల్లో మంచి ప్రతిభ చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలి. శిబిరం నిర్వహణకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు.

● శిక్షణ బాగుంది

- అక్షయ, క్రీడాకారిణి



చెగ్యాం ఉన్నత పాఠశాలలో ఇస్తున్న హాండ్ బాల్ శిక్షణ చాలా బాగుంది. ఇక్కడి శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో సిల్వర్ పథకం సాధించి, ఢిల్లీలో నిర్వ హించిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొన్నాను. వేసవి శిక్షణ శిబిరంలో పొరపాట్లు సరిదిద్దుకుంటూ మెళకువలు నేర్చుకుం టున్నాను.

● జాతీయ స్థాయిలో రాణిస్తా

వైద్య రాంచరణ్



జాతీయ స్థాయి పోటీల్లో రాణించి అంతర్జాతీ య స్థాయి పోటీల్లో ఆడాలని ఉంది. గత సంవ త్సరం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సిల్వర్ పథ కం సాధించాను. భవిష్యత్తులో ఇండియా తరఫున అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడమే లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

కొనుగోలుచేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్, మే 20 : రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తేమశాతం పరిశీలించి వెంటనే తూకంవేసి పంటను సంచుల్లో వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నం అయినపుడు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు కొనుగోలు కేంద్రాల్లో మౌళికవ సతులు కల్పించాలని అన్నారు. కొనుగోళ్ల పూర్తి అయ్యే వరకు రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు సూచించారు.

అనంతరం రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంప త్‌రావు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొడిమ్యాల, మే 20 : కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కథలాపూర్ మండలానికి చెందిన పవన్ అనే వ్యక్తికి గాయాలైనట్లు కొడిమ్యాల పోలీసులు తెలిపారు. బైక్‌పై వస్తున్న పవన్‌కు ఒక వాహనం తగలటంతో గాయాలపాలు కాగ అతనిని చికిత్స నిమ్మిత్తం ఆసుపత్రికి పోలీసులు తరలించినట్లు తెలిపారు.

నియామకం

మెట్‌పల్లి, మే, 20 : బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ కార్యదర్శిగా సాదుల్ల అంజయ్యను నియామిం చినట్లు సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండబేరి నరేష్‌ల ఆదేశాల మేరకు సోమవారం నియా మక పత్రాన్ని అందజేశారు. నాయకులు శంకర్, శీరీష్ కుమార్, శ్రీకాంత్, మాచర్ల సదానందం, ప్రతాప్, బాలే అజయ్, సురేష్, పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 20 : మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రేణుక ఎల్లమ్మ ఆలయంలోని ఆమ్మ వారికి నిర్వాహకులు అర్చనలు ప్రత్యేక పూజలను పురోహితులు జరిపారు. ఆమ్మ వారి దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని నుంచి భక్తులు తరలివచ్చారు.

ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యేను నిర్వహకులు, గ్రామస్తులు సన్మానించి అమ్మ వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ పోతు గంటి రాజేం దర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రత్నాకర్, నాయకులు ఇట్టెడి గంగారెడ్డి, గౌడ సంఘం నాయకులు, గ్రామస్థులు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో గ్రామస్థులు

శాఖ గ్రంథాలయంలో వసతులు కరువు

● నిరుపయోగంగా నూతన భవనం... ● పూర్తి కాక ముందే ప్రారంభించిన గత పాలకులు

కోరుట్ల, మే 20 : పట్టణంలోని శాఖ గంథ్రాలయం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో శాఖ గంథ్రాలయ పాత భవనాన్ని తొలగించి నూతన గంథ్రాలయ భవనం నిర్మించారు. పట్టణ ప్రజల అనుగుణంగా నిర్మాణానికి ప్రణాళికను అప్పటి రీడర్స్ కమిటీ సభ్యులు తీర్మాణం చేసి గత ప్రభుత్వానికి నివేదించంగా నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మాణానికి స్వీకారం చుట్టారు. అప్పటి ప్రభుత్వ హయాంలో జిల్లా గంథ్రాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ. 60 లక్షల రూపాయలను మంజూరు చేసి టెండర్లను పిలిచారు. టెండర్ పక్రియ పూర్తి కాగా జిల్లాలోని ఓ కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. అప్పడి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చేతుల మీదుగా భవన నిర్మాణం పనులను ప్రారంభించారు. పనులు వేగవంగా పూర్తి చేసినా మౌలిక వసతుల ఏర్పాటు నిర్లక్ష్యం వహించడంతో ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు రోజు బీఆర్ఎస్ నాయకులు భవనాన్ని ప్రా రంభించి చేతులు దులుపుకున్నారు. నూతన భవనంలో రీడర్స్ రూంలో ఎలాంటి పర్నీచర్ ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులు వారు తెచుకున్న స్టడీ చేర్లను ఉపయోగించుకుని చదువుకోవడం విశేషం. నూతన భవనంలో మూత్ర శాలలు, విద్యుత్ సౌకర్యం, తాగు నీరు, ప్రహరీ పూర్తి కాకపోవడంతో భవనం అసంపూర్ణంగా ఉండింది. ప్రస్తుతం జూనియర్ కళాశాల మైదానంలోని స్పోర్ట్స్ గదిలో గంథ్రాలయం కొనసాగుతోంది. అక్కడి భవనం రీడర్స్‌కు అనుకూలంగా లేక పోవడంతో గంథ్రాలయం వచ్చే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. వార్తా పత్రి కల చదివే వారు గతంలో వందల సంఖ్యలో ఉంటే ప్రస్తుంతం ఇప్పుడు పదుల సంఖ్యకు పడిపోవడం విచారకరంగా మారింది. పోటీ పరీక్షలను సిద్ధపడే వారి నిరుద్యోగులకు గ్రంథాలయాన్ని ఆశ్రయించిన వారికి సరైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఇప్పడికైన అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన గంథ్రాలయ భవనంలో మౌలిక వసతులు కల్పించి ఉపయోగంలోకి తీసుకురావాలని నిరుద్యోగలు, విద్యార్థులు కోరుకుంటున్నారు.



నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం

అనుమతి లేకుండా నూతన ఇళ్ల నిర్మాణాలు

● గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి .. ● పట్టించుకోని పంచాయతీ అధికారులు



కొడిమ్యాల గ్రామ పంచాయతీ కార్యాలయం

కొడిమ్యాల, మే 20 : కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీలో అనుమతులు లేకుండా నూతన ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు నూతన ఇంటి నిర్మాణానికి ముందు అనుమతి తీసుకోవాల్సిన ఇళ్ల యజమానులు అనుమతి పొందిన తర్వాత నిర్మాణం చేపట్టాలి. కొడిమ్యాలలో కొందరు అందుకు బిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవటంతో గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రోడ్డును ఆనుకొని, గ్రామ చివరన, వ్యాపార వీధుల్లో ప్రాధాన్యతనుబట్టి పాలక వర్గ తీర్మానం మేరకు స్కైర్ ఫిట్ 12 రూపాయల నుంచి 18 రూపాయల వరకు అనుమతి రుసుంను గ్రామ పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని అధికారుల ద్వారా తెలిసింది.. కొడిమ్యాల గ్రామ పంచాయతీ పరిదిలో సుమారు 15 నుంచి 20 ఇళ్ల వరకు ఎలాంటి అనుమతులు లేకుండా, కార్యాలయానికి దరఖాస్తులు ఇవ్వకుండ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి రుసుం చెల్లించకుండ నిర్మానాలు చేపడితే గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం గండి కొట్టినట్లవుతుంది. గ్రామంలో కొందరు అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టుతుండగా, మరి కొందరు దరఖాస్తులను కార్యాలయానికి సమర్పించి నిర్మాణాలను చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై కొడిమ్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్. వంశీవర్దన్ వివరణ కోరగా 2019 నుంచి ఇప్పటి వరకు 117 నూతన ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. నూతన ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన వారు దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందించాలన్నారు. గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు అనుమతి పొందిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలన్నారు. ఇటీవల 12 మంది నూతన ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు అందించినట్లు తెలిపారు. అనుమతి పొందకుండ ఇళ్ల నిర్మాణాలు చేపడితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అంజన్న సేవలో న్యాయాధికారి



న్యాయాధికారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

మల్యాల, మే 20: హైదరాబాద్ అడిషనల్ న్యాయాధికారి పాండు రంగారెడ్డి సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

సాయిబాబా ఆలయంలో ఉత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 20 : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వహకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శివ పార్వతుల కల్యాణంలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని ఆశీస్సులను పొందలన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మల్యాల, మే 20: రైతులను ప్రభుత్వం ఆదుకోని ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం సేకరించాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మామిడి చైతన్య, కొక్కెర మల్లేశం యాదవ్, నులుగొండ సురేష్, బొడిగే సురేష్, చక్రంగౌడ్, సామ మహిపాల్‌రెడ్డి, కట్కం లత, అవుదుర్తి రమ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కోరుట్ల, మే 20 : పట్టణానికి చెందిన ఇందూరి నరసింహాచారి కుటుంబానికి సోమవారం రైతు సంక్షేమ సమితి సభ్యులు ఆర్థిక చేయూతను అందించారు. నరసింహాచారి వారం రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులు చాలలేక ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్నా రైతు సంక్షేమ సమితి ట్రెజరర్ శీగద్దె సూర్య కిరణ్, రాష్ట్ర నాయకులు చిలివేరి రవికుమార్, అజయ్, వనపర్తి క్రాంతి కుమార్‌లు రూ.10,000 నగదును నరసింహాచారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

నృత్యకారిణికి ఆర్థిక సహాయం

రాయికల్, మే 20: రాయికల్ పట్టణానికి చెందిన బాల నృత్యకారిణి బొమ్మకంటి అంజనశ్రీకి విశ్వశాంతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మచ్చ గంగాధర్ సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. వికలాంగురాలు అయినప్పటికీ సాంస్కృతిక సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మండల, జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయి లో ఇనుమడింపజేసిన అంజనశ్రీకి అండగా ఉండేందుకు తాను ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. నాట్య కళాకారిణి సుధాచంద్రన్‌ను ఆదర్శంగా తీసుకుని కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న అంజనశ్రీకి మరికొంత మంది దాతలు ముందుకు రావా లని ఆయన కోరారు. అంజనశ్రీ తండ్రి నాగరాజుకు రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్, మే 20: మండలంలోని ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ హరీష్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొడిమ్యాల, మే 20 : కొడిమ్యాల, పూడూర్, తిర్మాలాపూర్ సింగిల్ విండో కార్యాలయాల్లో, కొడిమ్యాల, తిర్మాలాపూర్ ఆగ్రోస్ కేంద్రాలలో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ 60 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నట్లు ఏవో పి. జ్యోతి తెలిపారు. సోమవారం ఏవో విలేకరులతో మాట్లాడుతూ జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు 30 కిలోల బ్యాగ్‌కు 1116 రూపాయలను చెల్లించి ఒక బ్యాగ్‌ను పొందాలన్నారు. 30 కిలోల బ్యాగ్ రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్ బుక్, ఫోన్ నెంబరుతో సహకారం సంఘం లేదా ఏఈవోలను సంప్రదించాలని కోరారు.